# అప్పనప్పను

—గోపన్నకు - ఏ విచారమూ లేదు.

పెళ్ళాం మాత్రం పుట్టెడు దుఃఖంతో ఉంటుంది, ఎప్పుడు చూచినా ధుమధుమలాడుతూనన్నా ఉంటుంది. అక్షులూ - పక్షులూ హడలేట్టూ - తన్నూ - కనిపెంచి, పెద్దదాన్ని చేసి - పీడ వదుల్చుకున్నట్టు, చివరికి యీ నిర్భాగ్యుడికి అంటకట్టిపోయిన తలిదండ్రులనూ, కడుపున ఒక్క-కాయన్నా కాయించకుండా - కచ్చపట్టినట్టు ఆ రవంత వరమూ యివ్వడానికి మొగమొగాలు చూసుకుంటూన్న దేవాదిదేవులనూ - వాళ్ళకు పితృపితామహాదులంటూ ఉండేవాళ్ళనూ - తిట్టి దుమ్మెత్తిపోస్తూ ఉంటుంది.

అలా ఎప్పుడూ నోరు మూతపడకుండా ఆడిపోసుకుంటూ ఉంటుందంటే ఆ యిల్లాలు లోపం ఎంతమాత్రమూ లేదు. గోపన్న ఏదీ పట్టించుకోడు. బెల్లం

కొట్టిన రాయల్లే మిన్ను విరిగి మీదపడుతూన్నా తన్నుకొనట్టు నిశ్చింతగా ఉంటాడు. ఇంట్లో అపూటకన్నా వండి వార్చేందుకు-ఉప్పూపప్పూనిండుకున్నాయన్న విచారంలేదు. ఇంటి ఇల్లాలికి – మెడలో పసుపుకొమ్ము తప్ప – చిన్నం ఎత్తు పుస్తైన్నా లేక పోయెనే అన్న విచారం లేదు—

—“అంతా రాముడి కరుణ - అన్నింటికీ ఆ దయాసింధువే ఉన్నాడు—” ఇలా శ్రీరంగనీతులు చెపుతూంటే – తనకన్న వేయిరెట్లు దరిద్రంలో మునిగి తేలి, తరించిన భక్తుల చరిత్రలు నిదర్శనంగా ఏకరువు పెడుతూంటే - ఒళ్ళు మండుకు రాదూ? - ఆయనకు ముదిరిన వేదాంతం ఆడకూతురికి ఎలా అబ్బుతుందీ?—

ఎప్పుడూ చీటికీ మాటికీ కజ్జాతప్పదు. అది రగిలి - రగిలి రోజువిడిచి రోజన్నా పస్తులుండటం తప్పదు. ఇదంతా కూడా ఆ రాముని కరుణే! ఏదన్నా ఓ కారణం అంటూ కనబడితే ఆ పూటకు పొయిలో పిల్లి లేవకపోయెనే అనే ధ్యాసే పోతుంది. ఇలా కాగా - కాగా ఏనాటికైనా — ఈ రెండు పూటలా భోజనం కోసం అంగలార్చడం - ఉదరంమీద ఉండే ఈ మమతా, క్రమంగా సన్నగిలిపోయి - ఇవన్నీ తుచ్ఛ ఐహిక ప్రమేయములనీ - రామనామామృతం సేవించితే - ఆకలి దప్పులు జన్మజన్మలకూ ఉండవనీ — అందు లవలేశమన్నా వంటపడితే - అసలు మళ్ళీ జన్మంటూ ఉండదనీ – అందుకు - ఆ సుముహూర్తానికి - యిప్పుడు పడు తున్నామనుకున్న యాతనలన్నీ - దోహదములనీ - ఇలా తపించగా తపించగా - ఆ తరుణం రాకమానదనీ - గోపన్న ఎన్నో విధాల నచ్చ చెప్పాలని యత్నించాడు కాని, ప్రయోజనం లేకపోయింది.

లేకపోగా - ఆనాటి కానాటికి ఆవిడ హఠం మితిమీరిపోయింది. అందరికిమల్లే తానూ ప్రయోజకుడై - నలుగురి యిల్లాళ్ళలో తనూ తలయెత్తుకుని తిరిగేట్టు నిర్వాహకం చేయకపోతే - ఇహ, ఒక్కక్షణం యీ కాపురం చేయలేనంది. ఏ గంగలో నన్నా దిగుతానంది. అంత అఘాయిత్యం సాగకపోతే - అధమం పుట్టింటికైనా పోతానంది. ఆ ఎత్తే ముష్టి - నష్టి అక్కడే యెత్తుకు తింటానంది. తనూ, తన శ్రీరామచంద్రమూర్తీ కలిపి, ఎల్లకాలమూ ఉట్టికట్టుకు ఊరేగమంది. కుచేలో పాఖ్యానం, మహాభక్త విజయం కలిసి చలిమంట వేయమంది - ఇది ఏదో తేలేదాకా గంగ ముట్టనంది - మాటకు మాట జవాబు చెప్పవలసిన అవసరం లేదంది - చెప్పినా విననంది.

గోపన్న—శ్రీరామచంద్రుడి పటానికి నమస్కారంచేసి - ఉత్తరీయం వేసుకుని వీధిలోకి వెళ్ళిపోయినాడు. ఇది ఆ యింట మామూలే!—

వెళ్ళడం, తిరిగి మళ్ళీ పూజవేళకు యిల్లుపట్టడం ఇదీ మామూలే!—

—అతడు - అటు వెళ్ళాడో లేదో - ఎవరో పెద్దమనిషి – "గోపన్నగారు ఉన్నారా!" అంటూ వచ్చాడు. "ఉన్నారా అమ్మా!" అని ఆ యిల్లాలిని పలుకరించాడు.

"లేరు!—" అని ఆమె రుసరుసలాడింది.

"ఎప్పుడొస్తారు?"

"ఏమో!—"

"భోజనం వేళకు—"

— యిల్లాలు ఛర్రుమంటూ లేచింది—

"లేరంటే పోరాదూ? – ఎవరయ్యా మీరు ? మీకేం బాకీ ఉన్నారా?—"

ఆ పెద్దమనిషి - మృదువుగానే—

"వారి దర్శనానికి వచ్చానమ్మా?—" అన్నాడు.

"ఆఁ - అదే నే నంటూంట! - నాకు తెలుసు, వారి దర్శనానికే. ఆయన్నూ నన్నూ నడిబజారులోపెట్టి వేలం వేసినా రాగిడబ్బు రాలదు!—"

— "ఈ ఇల్లాలేం పైత్యానపడ్డదా ?—" అన్నట్టు విస్తుపోయి – ఆ పెద్దమనిషి – "అదేమిటి తల్లీ! - ఆయన దైవ సమానులమ్మా!—" అని మాత్రం అని సెలవు పుచ్చుకున్నాడు.

ఆయన గడప దిగీదిగడంతోనే – పూచిన తంగేడల్లే ఒంటినిండా నగలతో - వయ్యారి నడకతో - నవ్వుకుంటూ, కలకలలాడుతూ - "ఇది తప్పకుండా సానే!" అని తేలికగా అర్థమయే వాలు చూపులతో - మాంచి ఏపుమీద ఉన్న ఓ సింగారి - అతి చొరవగా లోపలికి వచ్చి - "అమ్మగారూ దణ్ణం!" అంటూ దగ్గరగా కూర్చుంది.

"ఎవరు నీవు ? – " కొట్టొచ్చినట్టు అడిగింది ఆ యిల్లాలు చూసీ చూడటంతోనే కళ్ళుకుట్టి.

"అయ్యగారు ఉన్నారా అమ్మా!"

"ఏం - మా ఆయనతో నీకేం పని?-"

"ఉంది!-"

"ఉందీ? ఎత్తింది ఆడపుటక కాదూ, సిగ్గు లేదూ?- పట్టపగలు నడిబజారుగుండా నడిచివచ్చి - ఆయనతో పనుందంటావ్ ?- ఈ ఇంటోకి నిన్నెవరు రమ్మన్నారు ? మింగ మెతుకు లేదుగాని - మధ్య మాకు ఇదో తంటసమా ? - ఇదా భక్తి? - కను క్కుంటానుండు -!"

"అపచారమమ్మా !-"

"నాకు నీతులు బోధిస్తావుటే ?- నీ బ్రతుకెంత, నీవెంత -"

"ఔనమ్మా!- నా మనవి ఆలకించండి !-"

"ఏమిటా మనవి ?-"

"ఇదే !-"

— వెయ్యి మొహరీలున్న మూట చెంగున తీసి, ఆ యిల్లాలు ముందు ఉంచింది - "మీదేనమ్మా - మా ముత్తవ తల్లికి అయ్యగారు - ఏదో చల్లని ముక్క ఏనాడో చెవిని వేశారు. అదే స్మరించుకుంటూ సుఖంగా కాలం వెళ్ళబుచ్చుకుంది. చివరి ఘడియల్లో నాకు చెప్పి పోయిందమ్మా - సరిగా నాటికి ఏడాదినాడు - అయ్యగారికి ఈ తృణం సమర్పించి - స్వీకరించమని ప్రార్థించానని మనవి చేయమన్నదమ్మా - నేను మనోహరినమ్మా - మీ దర్శనం యీ రూపేణా చేసుకున్నాను - కాని, అప్పుడప్పుడు అయ్యవారి పాదాలు కళ్ళకు అద్దుకుంటాను-"

మొగాన బొట్టుపెట్టి - చేత తాంబూలం వుంచి - ముల్లె అందించి సాగిలి మ్రొక్కింది-

"అదేమిటే, నీ యిల్లు బంగారంగానూ - నాకు మొక్కుతా వెందుకే - నీవు మంచిదానవు గనుక - మీ ముత్తవతల్లి మాట దక్కించావు! మరొకళ్ళయితే-అప్పుడు తల ఊపినా - యింత సొమ్ము చేజార విడుచుకుంటారా?- నీకు పిల్లలెందరు? - ఎన్న డన్నా వచ్చి చూసి పోతూండు-"

మనోహరి సెలవు తీసుకుని వెళ్ళిపోయింది. గడియకు గోపన్న వచ్చాడు. వచ్చీ రావడంతోనే - యిల్లాలు గునగునలాడుతూ - "ఏమండోయ్!-" అంటూ గంతు

లేసినట్టు వచ్చి, కంఠం పెనవేసుకుని - గుక్కతిప్పకుండా చెప్పివేసింది - ముల్లె కళ్ళ ఎదుట గలగల లాడించింది.

"రామా ! -" అన్నాడు గోపన్న నిట్టూర్పుగా -

"పుచ్చుకున్నావా ?"

"అదేమిటండీ ? - పుచ్చుకోక చేదా ?-"

"కాదుటే - వెర్రిదానా ?-"

"ఇహ మీ వేదాంతం చాలించండి - లెండి భోజనానికి —"

—ఇలా అంటూండగానే - యిందాకటి పెద్దమనిషి మళ్ళీ చక్కా వచ్చాడు. గోపన్నకు మ్రొక్కాడు - చూసీ చూడటంతోనే - ఆ యిల్లాలు నవ్వుమొగంతో - "దయచేయండి బాబూ!" అని ప్రత్యుత్థానం చేసి - "ఇంతకు ముందు ఒకసారి వచ్చి వెళ్ళారండీ, "వస్తారు, ఉండండి" అందామనుకుంటూండగానే చక్కా పోయినారు - వారిని కూడా భోజనానికి ఉండమనండి-" అంటూ లోపలికి చక్కాపోయింది.

"ఎవరు బాబూ తమరు ?" గోపన్న ఎంతో వినయంగా పలుకరించాడు. వచ్చిన పెద్దమనిషి, అదాటున గోపన్న పాదము లందుకుని కళ్ళకు అద్దుకున్నాడు.

"అదేమిటి బాబూ !" అని గోపన్న కలవరపడుతూ తప్పుకుని- లేవనెత్తాడు-

"అంతే అయ్యా !- ఇందుకోసం ఇన్నాళ్ళూ తపించాను - ఇప్పటికి తరించాను.

కొన్నేళ్ళ క్రితం-గోదావరి స్టేషనులో, రాత్రిపూట మీరు నిద్రపోతూండగా - మీరొండినున్న మూడు పచ్చనోట్లూ మాయమైనాయ్, కాదూ? తీసింది నేనే — అప్పటికి నాకు అదే వృత్తి — కాని, ఆ సొమ్ము వచ్చిన వేళావిశేషాన ఆనాటినుంచీ నేను పట్టింది బంగారమైంది. అనుకోకుండా, ఏమీ యత్నం లేకుండా, అన్నీ కలిసివచ్చినవి వాటంతట అవే.

నేను మళ్ళీ ఎన్నడూ నీచానికి దిగలేదు - మీ సొమ్ము విడిగా వర్తకంలో తిప్పాను - వృద్ధి అయింది - మనవి చేసుకుందామని వచ్చాను - అనుగ్రహించారా ! - "

గోపన్న ఆశ్చర్యపడలేదు — కనురెప్పైనా కదలించలేదు.

"శ్రీరాముడికి దయకలిగింది. నాయనా ! - ఆ కొంటెవాడు ఎప్పుడూ యింతే - "

ఇల్లాలు లోపలికి వెళ్ళినట్టు వెళ్ళిందేకాని — లోగుమ్మంలో నిలుచుని ఇదంతా ఆలకించింది. కళ్ళింతలు చేసుకుని,

"ఏం బాబూ - ఏమాత్రం వృద్ధి అయింది ?-" అన్నది —

"లక్ష రూపాయలు దాటుతుందమ్మా ! - యీ యేటి లాభాలు కలుప లేదింకా — "

"నా ఉనికి ఎలా తెలిసింది నాయనా !—" అని గోపన్న కించపడుతూ అడిగాడు.

"ఆనాడు పైకంతోబాటు రైలు టిక్కెట్టు కూడా ఉంది కదా బాబూ ! ప్రయాణం ఎక్కడికో తెలిసింది. - చూచాలాపంగా చూసి. మీ పక్కనే జారవిడిచాను. తరువాత కొన్నాళ్ళకు యీ ఊరువచ్చి జాడలు తీశాను. మీ దర్శనం చేశాను. అప్పుడప్పుడువచ్చి మీ కంటపడకుండా, దూరాన్నుంచే మ్రొక్కి పోతూండేవాడిని. ఈ మాత్రమైనా కూడబెట్టి, అప్పుడొచ్చి మీ పాదాలదగ్గిర వ్రాలుదామనుకున్నాను. ఈ నాటి కది సిద్ధించింది."

ఉన్నంతలో భుజించి ఆ పెద్దమనిషి సెలవు తీసుకున్నాడు. తనకు అగత్యం లేదనీ, ఆ సొమ్ము తన యిల్లాలి పరం చేయవలసిందనీ, గోపన్న — అతడలా ప్రాధేయపడుతూంటే కాదనలేక ఒప్పుకున్నాడు.

"ఇవాళ లేచినవేళ ఎటువంటిదండీ !" అని ఆ యిల్లాలు కలకలలాడింది. చిట్టిపొట్టి పోషెములు ఎన్నో చేయబోయింది. తాము, ముందు ముందు ఎలా సుఖపడ బోయేదీ - ఇన్నాళ్ళుగా మనసులోనే కుమిలి హతమారిపోతూన్న ముద్దుముచ్చెటు లన్నీ ఎలా తీర్చుకునేదీ, నోరు నొప్పిలేకుండా ఏకరువు పెట్టింది. అన్నీ విని, విని - గోపన్న -

"ఇంతటితోనైనా కడుపు నిండినట్టేనా ?" అని నవ్వుగా, సౌమ్యంగా అడిగాడు.

"ఆహా! నాకింకేం కోరికా లేదు. నేను పట్టిన నోములు ఫలం లేకుండా పోతాయా ! — ఇల్లాగే మళ్ళీ యీనాటికి మన నట్టింట ఉయ్యాల తొట్టె వేసుకుంటే —"

గోపన్న వంక కొత్త పెళ్ళికూతురల్లే చూసి సిగ్గుపడ్డది.

గోపన్నకు — కన్ను తడి అయింది.

పూజామందిరం దగ్గరకు వెళ్ళి — "అర్థం అయింది ప్రభూ!-" అని నవ్వాడు- వచ్చేశాడు.

గోపన్న మళ్ళీ యింటికి రానేలేదు. ఎందరిని విచారించినా ఎవరికీ ఆచూకీ తెలియదు. ఎన్ని దేశాలు గాలించినా జాడలేదు. ఏమైపోయినాడో తెలియదు.

వేసీవేయకుండా ఉన్న ఆ యింట్లో - ఆ యిల్లాలు ఒక్కతే - ఎప్పుడూ ఆ పూజామందిరం దగ్గిరే కూర్చుంటుంది—"అర్థం అయింది ప్రభూ! అనుగ్రహించు!-" అని జపిస్తూంటుంది.

తొలిరోజుల్లో విలవిలా ఏడ్చేది. భయపడేది. ఇప్పుడు ఏ విచారమూలేదు. అతి శాంతంగా ఉంటుంది. ఏనాటికైనా అతడు తిరిగి వస్తాడనే నమ్మకం ఉంది. ఎప్పుడు వస్తాడో అనే ఆరాటం మాయమైంది. అలా, రాముణ్ణిచూస్తూ కూర్చోడం తప్ప-ఆ యిల్లాలికి మరోకోరికా - ధ్యాసా - లేదు.